

# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక


సంపుటి : 6 సంచిక : 211 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 26 ఆగస్టు 2026 Ysr kadapa

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

రూ.840.41 కోట్లతో విస్తరణకు కేంద్రం ఆమోదం

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



2లో

## ఉచిత పథకాలకు తాను వ్యతిరేకం

- వాటితో ఆర్థికంగా తీరని నష్టం
- విద్యా వైద్యంలనే ఉచితంగా ఇవ్వాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



2లో



## 30 ఏళ్ల నాటి నిర్ణయం ఫలించింది

- వెలిగొండ పూర్తి చేయడంపై ఎక్స్‌లో చంద్రబాబు

**అమరావతి,మన జనప్రగతి, ఆగస్టు 25:** వెలిగొండ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం ప్రాంత రూపురేఖలు మారనున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. 30 ఏళ్ల క్రితం తాను తీసుకున్న సంకల్పం నెరవేరిందంటూ 'ఎక్స్' వేదికగా ఆయన పోస్ట్ చేశారు. ఎన్నో అవాంతరాలు,

మిగతా2లో...

## పునరుత్పాదక ఇంధన రంగంలో ముందుంటాం

- ఎపిలో సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం
- హులికెరలో సుజ్లాన్ విండ్ పవర్‌కు శంకుస్థాపన
- పవన్ విద్యుత్‌లో పలువురికి ఉద్యోగావకాశాలు: లోకేశ్ వెల్లడి








**అనంతపురం,మన జనప్రగతి, ఆగస్టు 25:** ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ గ్రూప్ చేపడుతున్న ప్రాజెక్టుల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా2లో...



## శ్రీశైలం వడ్డెర సత్రంలో దారుణం

ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య

నెలరోజులుగా సత్రంలోనే ఉండడంపై అనుమానాలు

దర్యాప్తు చేపట్టిన స్థానిక పోలీసులు

**నంద్యాల,మన జనప్రగతి, ఆగస్టు 25:** శ్రీశైలంలో విషాద ఘటన చోటు చేసుకుంది. శ్రీశైలం వడ్డెర అన్నదాన సత్రంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. గత 3 రోజులుగా రూమ్ నుంచి బయటకు రాకపోవడంతో పాటు దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన సత్రం నిర్వాహకులు వెంటనే పోలీసులకు సమాచారం

మిగతా2లో...

## స్థానిక ఎన్నికల్లో పట్టుదలగా పనిచేయాలి

- నియోజకవర్గాన్ని వదిలి బయటకు వెళ్లరాదు
- ఎన్నికల్లో గెలుపు వైపికి అత్యంత ముఖ్యం
- అధికార దుర్వినియోగం జరగకుండా అడ్డుకోవాలి
- పార్టీ ముఖ్యనేతలతో ఎన్నికలపై జగన్ దిశానిర్దేశం



2లో

## ఇక పైలెట్లకూ డోపింగ్ టెస్ట్‌లు

- మాదక ద్రవ్యాలు వినియోగంచకుండా ఆంక్షలు
- టెస్ట్ వ్యవహారాలను పరిశీలిస్తున్న డిజిసి
- కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ,మన జనప్రగతి, ఆగస్టు 25:** ఇకపై ఏడాదికి ఒక్కసారైనా విమాన పైలట్లకు డోప్ టెస్టులు నిర్వహించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. పైలట్లు మాదకద్రవ్యాల, మత్తు పదార్థాలు ఉపయోగించకుండా అరికట్టేందుకు, భవిష్యత్తులో కఠినమైన నిబంధనలు తెచ్చేందుకు డీజీసీఏ ప్రస్తుతం విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతోందని చెప్పు కొచ్చారు. ప్రస్తుతం మొత్తం పైలట్ల సంఖ్యలో 10 శాతం మందికి మాత్రమే డోప్ టెస్టులు నిర్వహించాలనే

మిగతా2లో...

## సిఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

ఎందుకు అమెరికా పర్యటనో వివరంగా చెప్పాలి

మేయర్ మమ్దానీని ఎందుకు కలవాలనుకున్నారో చెప్పాలి

నిబంధనల మేరకే కేంద్ర విదేశాంగశాఖ నిర్ణయాలు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ




**న్యూఢిల్లీ,మన జనప్రగతి, ఆగస్టు 25:** అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని కొట్టిపారేశారు.

మిగతా2లో...



## ఎపిలో జూడాల సమ్మె విరమణ

హైకోర్టుకు వివరించిన జూనియర్లు

జూడాలకు న్యాయం చేస్తామన్న మంత్రి సత్యకుమార్

**అమరావతి,మన జనప్రగతి, ఆగస్టు 25:** ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ వైద్యులు సమ్మెను విరమించారు. ఈ విషయాన్ని జూడాలు.. హైకోర్టుకు నివేదించారు. తమ డిమాండ్లను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని వారు హైకోర్టును అభ్యర్థించారు.

మిగతా2లో...

## వారిపై చర్యలు ఉంటాయి: మల్లు రవి



**హైదరాబాద్:మన జనప్రగతి, ఆగస్టు 25:** మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పూర్తి అంశాలతో నివేదికను పొందు పరిచి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌కు అందజేశామని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి స్పష్టం చేశారు. దీనిని పార్టీ రాష్ట్ర వ్యవహారాల

మిగతా2లో...

# పునరుత్పాదక ఇంధన రంగంలో ముందుంటాం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. రాష్ట్రంలో అదనంగా 1.3 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుజ్లాన్ గ్రూప్ పెట్టుబడులు పెడుతోందని నారా లోకేష్ వెల్లడించారు. ఉరుకొండ వద్ద ఉన్న బ్లేడ్ల తయారీ యూనిట్ విస్తరణతో పాటు కొత్త ప్రాజెక్టుల ద్వారా దాదాపు 4,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. 2016లో ప్రారంభమైన అనంతపురం సుజ్లాన్ ప్లాంట్ ద్వారా ఇప్పటికే సుమారు 2,000 మందికి ఉపాధి లభించిందని మంత్రి పేర్కొన్నారు. ఇందులో దాదాపు 70 శాతం మంది స్థానిక యువత ఉండటం సంతోషకరమన్నారు. స్థానిక ఐటీఐలను దత్తత తీసుకుని శిక్షణ అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. సుజ్లాన్ సంస్థ వర్క్‌ఫోర్స్‌లో 40 శాతం మంది మహిళలు ఉండటం అభినందనీయమని నారా లోకేష్ అన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరగడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని తెలిపారు. పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులతో నెలవారీ సమావేశాలు నిర్వహించి పరిశ్రమలకు ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక అడ్వైజరీ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. పెట్టుబడులు ఆలస్యం కాకుండా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగానికి అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేసి భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నారా లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని కణెకల్లు మండలం హులికెరలో సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్ట్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. అలాగే సుజ్లాన్ 144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్‌ను ప్రారంభిం చారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ సంస్థ రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించ నున్నట్లు సుజ్లాన్ సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలో సుజ్లాన్ ఇప్పటికే కీలక పవన్ విద్యుత్ సంస్థగా ఎదిగింది. ఏపీలో ఈ సంస్థకు 1700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యం ఉంది. ఇది 2030 నాటికి అదనంగా 5 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని సుజ్లాన్ ప్రణాళికలు రూపొందించింది. నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకునేందుకు ఈ సంస్థ ముందుకు సాగుతోంది.

# శ్రీశైలం వడ్డెర సత్రంలో దారుణం

(మొదటి పేజీ తరువాయి)

అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులు తెరచి చూడగా బాత్రూమ్‌లో ముగ్గురు మహిళలు, ఫ్యాన్‌కు ఇద్దరు పురుషులు ఉరివేసుకొని కనిపించారు. మృతులు సుధాకర్(36), గోగుల ఆదిలక్ష్మి(50), మల్లేశ్వరి(45), శ్రీదేవి(33), మణికంఠ(15)గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. శ్రీశైలం వడ్డెర సత్రంలో సంఘటనా స్థలాన్ని ఆలయ ఈవో శ్రీనివాసరావు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ పరిశీలించారు. సుధాకర్ కుటుంబ సభ్యులు.. గత నెల 28వ తేదీన శ్రీశైలం వడ్డెర సత్రం రూమ్ నెంబర్ 11లో రూ. 800 చెల్లించి అద్దెకు తీసుకున్నారు. రెండు రోజుల తర్వాత ఖాళీ చేయాలని సత్రం నిర్వాహకులు చెప్పినప్పటికీ.. అనారోగ్యంతో వచ్చామని, మరికొద్ది రోజులు ఉండి పూజలు చేయించుకుంటామని సుధాకర్ చెప్పినట్లు సమాచారం. రోజుకు 800 రూపాయలు చెల్లిస్తూ వ్డడెర సత్రంలోనే సుధాకర్ కుటుంబ సభ్యులు ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులు సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ఐదుగురి మృతదేహాలను కిందకు దించిన శ్రీశైలం పోలీసులు.. శవ పరీక్షల కోసం సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా వడ్డెర సత్రం యాజమాన్యం.. యాత్రికులకు నెల రోజులపాటు రూమును ఎందుకు అద్దెకు ఇచ్చారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతిచెందిన వ్యక్తులు శ్రీశైలంలో నెల రోజులపాటు ఎందుకు ఉన్నారనే కోణంలోనూ విచారణ చేపట్టారు.

# స్థానిక ఎన్నికల్లో పట్టుదలగా పనిచేయాలి

**అమరావతి,మన జనప్రగతి, ఆగస్టు 25:** స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే ప్రజలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పష్టమైన తీర్పు ఇస్తారని అన్నారు. గతంలో స్థానిక ఎన్నికల సందర్భంగా అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు, ప్రలోభాలు చూశామని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆషామాషీగా తీసుకోవద్దని జగన్ సూచించారు. ఇవి కేవలం గెలుపోటములకు సంబంధించిన ఎన్నికలు కాదని, పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన ఎన్నికలని అన్నారు. అధికార పార్టీ నుంచి ఎలాంటి ఒత్తిళ్లు, దౌర్జన్యాలు ఎదురైనా నాయకుడు తమ వెంట ఉన్నాడనే భరోసా కార్యకర్తలకు కల్పించాలని సూచించారు. పార్టీ ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు జగన్.. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీలు హాజరయ్యారు..ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటన తమకు అనుకూలంగా మారే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జడ్పీ చైర్మన్, మేయర్ వంటి కీలక పదవులకు బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని పార్టీ నేతలకు సూచించారు. అవసరమైన చోట కార్యకర్తలకు అండగా నిలిచేందుకు కుటుంబ సభ్యులను కూడా పోటీలోకి దింపడానికి వెనుకాడవద్దని అన్నారు. ఏకగ్రీవాలకు అంగీకరిస్తే కఠిన నిర్ణయాలు ఉంటాయని జగన్ హెచ్చరించారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలు జరిగేందుకు అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే, తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి కో-ఆర్డినేటర్లు పార్టీ అభ్యర్థులుగా ఉండరని తెలిపారు. ఎన్నికల అనంతరం అభ్యర్థులను ఎక్కడెక్కడ నిలబెట్టారు, వారికి ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత బలంగా మద్దతిచ్చారనే అంశాలపై నివేదికలు తీసుకుంటానని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటంతో అభ్యర్థి వ్యక్తిగత బలం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో భావోద్వేగాలు, వ్యక్తిగత ఈగోలకు తావివ్వకుండా అందరినీ కలుపుకొని వెళ్లాలని సూచించారు. ఒక్కో ఓటు కూడా కీలకమని, తొమ్మిది ఓట్లతో గెలిచిన సందర్భాలు, తొమ్మిది ఓట్లతో ఓడిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. 'గెలుపే ముఖ్యం.. గెలుపు కోసం ఈగోలను పక్కన పెట్టాలి' అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేసి, సమర్థుడైన కార్యకర్త చుట్టూ ఏకాభిప్రాయం తీసుకురావాలని జగన్ సూచించారు. రాబోయే 60 నుంచి 70 రోజులు నాయకులు తమ నియోజకవర్గాలను దాటి వెళ్లకుండా స్థానిక ఎన్నికలపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని అన్నారు. ఇంటింటి ప్రచారం ద్వారా వైఎస్సార్‌సీపీ పాలన, కూటమి పాలన మధ్య ఉన్న తేడాలను ప్రజలకు వివరించాలని సూచించారు.పోలీసు అధికారులు తమ పదవులను దుర్వినియోగం చేయకుండా న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జగన్ కోరారు. కార్యకర్తలను వేధించే లేదా అన్యాయం చేసే అధికారుల వివరాలను నమోదు చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారులపై భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తటస్థంగా వ్యవహరించాలని కోరారు వైసీపీ అధినేత వైఎస్ జగన్..

# ఇక పైలెట్లకూ డోపింగ్ టెస్ట్‌లు

(మొదటి పేజీ తరువాయి)

నిబంధన అమల్లో ఉందని చెప్పారు. ఏడాదిలో ఒకసారి ప్రతి పైలట్‌కూ పరీక్ష నిర్వహించేలా దీనిని మార్పు చేయాలనే అంశాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పరిశీలిస్తోందన్నారు. భద్రత, నిర్వహణ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై ఓ నిర్ణయం తీసుకుం టామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను మరింత కఠినం చేసే మార్గాలపైనా డీజీసీఏ అధ్యయనం చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా పుకెట్-దిల్లీ విమాన ఘటనపై మాట్లాడుతూ.. దీనిపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేస్తోందన్నారు. విమానంలోని పైలెట్ డేటా రికార్డర్ దర్యాప్తు సంస్థ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. థాయ్‌లాండ్ నుంచి దిల్లీకి వస్తున్న విమానం ఆగస్టు 4న తీవ్ర కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే.

ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. తొలి పరీక్షలో పైలట్-ఇన్- కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. దీని తర్వాత సైకోయాక్టివ్ పరీక్ష నిర్వహించగా.. గంజాయి సేవించినట్లు నిర్ధరణ అయ్యింది. ఈ ఘటనపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు జరుపుతోందని పేర్కొన్నారు. విమానం డేటా రికార్డర్లు, ఇతర భాగాలు సురక్షితంగా ఉన్నందున, త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

ప్రస్తుతం పైలట్ నెట్‌వర్క్‌లో కేవలం పదిశాతం మందికి మాత్రమే రాండమ్‌గా డోప్ టెస్టులు నిర్వహిస్తున్నారని రామ్మోహన్ వెల్లడించారు. ప్రతీ పైలట్‌కు సంవత్సరంలో కనీసం ఒక్కసారైనా రాండమ్‌గా పరీక్ష నిర్వహించాలనే ప్రతిపా దనను ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. విమాన ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమైనదని చెప్పారు.

# సిఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగినట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు.ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం నుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు. ఇది సాధారణ ప్రక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు. ప్రధాని మోదీని టెర్రరిస్ట్ అని న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యనించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మామ్దానీను ఎందుకు కలుస్తున్నారో.. సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గతంలో తన విదేశీ పర్యటనను కూడా కేంద్ర విదేశాంగ శాఖ నిరాకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. మన దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడ్డారు.

గుజరాత్ సీఎంకు యూఎస్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. తమకు అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ వాదించడం వితండవాదమని పేర్కొన్నారు.

నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని చెప్పారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు చదివేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలను కూడా గతంలో రద్దు చేసిందని చెప్పారు. కుల గణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్యూర్ అయిందని తెలిపారు. హైదరాబాద్‌లో 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కుల గణనపై అవగాహన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

**న్యూఢిల్లీ,మన జనప్రగతి, ఆగస్టు 25:** తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 365బీబీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుట్టాయగూడెం-ఎల్ఎన్‌డీ పేట, పట్టిసీమ- కొవ్వూరు సెక్షన్ల మధ్య 45.09 కిలోమీటర్లతో రహదారి ఉన్నతీకరణ కోసం రూ.840.41 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 45 కిలోమీటర్ల 2 లేన్ల జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నట్లు గడ్కరీ తెలిపారు. ఈ రహదారి ఉన్నతీకరణతో పోలవరం ప్రాజెక్ట్, పరిసర గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం పొగాకు, చెరకు, ఫామాయిల్ తోటలతో నిండి ఉంటుందని.. ఈ హైవే అభివృద్ధితో మౌలిక సదుపాయాలు మెరుగు అవుతాయన్నారు. పంటల రవాణా వేగంగా, సురక్షితంగా జరుగుతుందని చెప్పారు. పంట పొలాల నుంచి మార్కెట్‌కు అనుసంధానం పెరుగుతుందని, స్థానికంగా జీవనోపాధి మెరుగవుతుందని గడ్కరీ పేర్కొన్నారు. అప్‌గ్రేడ్ చేసిన జాతీయ రహదారితో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరగడంతో పాటు, ఇరురాష్ట్రాల ప్రయాణికులకు, పర్యాటకులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులు సులభంగా ఘాట్ల వద్దకు చేరుకోవడానికి, పోలవరం ప్రాజెక్ట్ సందర్శించేందుకు వీలవుతుందన్నారు.

# ఉచిత పథకాలకు తాను వ్యతిరేకం

**నెల్లూరు,మన జనప్రగతి, ఆగస్టు 25:** మరోసారి ఉచిత పథకాలపై తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పేశారు వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు.. నెల్లూరు జిల్లా వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత పథకాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఉదయగిరి ప్రాంత ప్రజలు తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని వెంకయ్య నాయుడు గుర్తుచేసుకున్నారు. ఈ ప్రాంత ప్రజలే తనను ఉదయగిరి నుంచి ఉపరాష్ట్రపతి స్థాయి వరకు తీసుకెళ్లారని అన్నారు. తన ఎదుగుదలలో ఈ ప్రాంత ప్రజల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇక, రాష్ట్రంలో అమలు చేస్తున్న ఉచిత పథకాలకు తాను వ్యతిరేకమని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాల వల్ల ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై భారం పెరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అయినా, గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలైనా ఉచిత పథకాలను నిలిపివేయాలని అభిప్రాయపడ్డారు. కానీ, ప్రజలకు ఉచితంగా అందించాల్సింది విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి ప్రాథమిక సదుపాయాలని వెంకయ్య నాయుడు అన్నారు. పేదలకు మాత్రమే అవసరమైన సంక్షేమ పథకాలు అందేలా విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందితే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం ప్రపంచ దేశాలకు దీటుగా అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోందని వెంకయ్య నాయుడు అన్నారు. దేశ ఆర్థిక, మౌలిక రంగాల్లో పురోగతి సాధిస్తూ అంతర్జాతీయ స్థాయిలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని పేర్కొన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు..

# 30 ఏళ్ల నాటి నిర్ణయం ఫలించింది

(మొదటి పేజీ తరువాయి)

సవాళ్లను అధిగమించి భగీరథ ప్రయత్నంతో వెలిగొండ ఫేజ్-1ను పూర్తి చేసి కరవు నేలకు కృష్ణమ్మ జలాలను అందించబోతున్నామని చెప్పారు. 1996 మార్చి 5న వెలిగొండకు శంకుస్థాపన చేసిన తానే.. మూడు దశాబ్దాల తర్వాత ఈనెల 31న ప్రాజెక్టును ప్రారంభించబోతున్నట్లు సీఎం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు శంకుస్థాపన నాటి ఫొటోను ఆయన షేర్ చేశారు. వెలిగొండ ఫేజ్-1 ద్వారా 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్-2తో 3.283 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు లక్షలాది మందికి తాగునీరు అందించడమే లక్ష్యం అన్నారు. ఈ నెల 31న 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు విడుదల చేయనున్నాం. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసి పశ్చిమ ప్రకాశం ప్రజల ఆకాంక్షను నెరవేర్చాం. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం ప్రాంతాలను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో త్వరలో పనులు ప్రారంభిస్తాం అని అన్నారు. బెంగళూరు-అమరావతి హైవే, రామాయపట్నం పోర్టుతో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయి. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించి ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఎపిలో జూడాల సమ్మె విరమణ

(మొదటి పేజీ తరువాయి)

జూనియర్ వైద్యుల సమ్మెపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జూడాలు సమ్మె విరమిస్తున్నట్లు న్యాయస్థానానికి తెలియజేశారు. అదే సమయంలో తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోర్టును కోరారు. జూనియర్ వైద్యుల డిమాండ్లను పరిష్కరించే అంశంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీంతో ఏపీలో జూనియర్ వైద్యుల సమ్మెకు ప్రస్తుతానికి తెరపడినట్లైంది. ఇదిలావుంటే జూనియర్ డాక్టర్ల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. జూడాల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం తీసుకొస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. జూడాల స్టైఫండ్ పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. హైకోర్టు సూచనల మేరకు ఆరోగ్య శాఖ కార్యదర్శి వీర పాండ్యన్ ఆధ్వర్యంలో ఈ కమిటీ పని చేస్తుందని వివరించారు. ఒకటి, రెండు రోజుల్లో జూడా ప్రతినిధులతో ఈ కమిటీ సమావేశం అవుతుందన్నారు. అయితే తెలంగాణలో స్టైఫండ్ అధికంగానే ఉందని.. ఇతర దక్షిణాది రాష్ట్రాల స్టైఫండ్‌లతో కూడా పోల్చి ఓ నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే రిటైర్మెంట్ వయసు పెంపుపై తుది నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. జూడాల అభ్యంతరాల నేపథ్యంలో రిటైర్మెంట్ అంశంపై పునఃపరిశీలన చేస్తామని చెప్పారు. నాన్ క్లినికల్ పోస్టుల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ నియామకాలపైనా కూడా సమీక్ష చేస్తామని ప్రకటించారు. ఎన్ఎంసీ మార్గదర్శకాల మేరకే నోటిఫికేషన్లు జారీ చేశామని మంత్రి సత్యకుమార్ వివరించారు. రాష్ట్రంలో 9,500 మంది జూడాలు కీలక వైద్య సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. సమ్మె విరమించిన జూడాలకు ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# వారిపై చర్యలు ఉంటాయి: మల్లు రవి

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు పంపారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..గత విషయాలను కూడా పరిగణలోకి తీసుకున్నామని వివరించారు. ఈ నివేదికను ఏఐసీసీ చీఫ్, పార్టీ జనరల్ సెక్రటరీకి కూడా పంపిస్తారని అన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాల మేరకు వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో నాయకులు, క్యాడర్‌కు ఒక మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నామని మల్లు రవి తెలిపారు. పార్టీపై నెగెటివ్ అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు.

# అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా



**కర్నూలు బ్యూరో, మన జనప్రగతి, ఆగస్టు 25:-** అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ లావణ్య వేణి ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా శుద్ధీకరణలో భాగంగా మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డూప్లికేట్ ఓటర్ల వివరాలను పరిశీలించి సరిచేయాలని సూచించారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి అధికారులకు సహకరించాలని కోరారు.కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల్లో 18 ఏళ్లు నిండినప్పటికీ ఓటర్లుగా నమోదు కాని వారిని గుర్తించి ఫారం-6 ద్వారా నమోదు చేయించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, భవనాల మరమ్మతులు తదితర పెండింగ్ అంశాలను ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పరిష్కరించుకోవాలని తెలిపారు.కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి మాట్లాడుతూ జిల్లాలో 8.93 లక్షల మంది పురుషులు, 9.19 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. 2026 ఓటర్ల జాబితా సవరణలో సుమారు 2.73 లక్షల మేర ఓటర్ల సంఖ్య తగ్గిందన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ 86.89 శాతం పూర్తయిందని వెల్లడించారు.

# పీఎం సూర్య ఘర్ యోజనతో ప్రతి కుటుంబానికి ప్రయోజనం



**కర్నూలు బ్యూరో, మంత్రాలయం, మన జనప్రగతి, ఆగస్టు 25:-** పీఎం సూర్య ఘర్ యోజన ద్వారా విద్యుత్ పొదుపుతో ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.మంగళవారం మంత్రాలయం మండలం రాచుమర్రి గ్రామంలో లబ్ధిదారుడు అజయ్‌కుమార్ ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి పరిశీలించారు. 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్ పనితీరు, సబ్సిడీ, లబ్ధిదారులకు కలుగుతున్న ప్రయోజనాలను వారు అడిగి తెలుసుకున్నారు. సోలార్ ప్యానెళ్లు, ఇన్వర్టర్లు తదితర పరికరాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, ప్లాంట్లు దీర్ఘకాలం సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.అర్హులైన లబ్ధిదారులకు 60 శాతం వరకు సబ్సిడీ అందుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు పథకాన్ని సద్వినియోగం చేసుకుని సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవాలని మంత్రులు కోరారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# మంత్రాలయంలో శ్రీ గురు రాఘవేంద్ర స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు


**- రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, ఆరోగ్యం.. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు**



**కర్నూలు బ్యూరో, మంత్రాలయం ఆగస్టు 25:-** మంత్రాలయంలోని ప్రసిద్ధ శ్రీ గురు రాఘవేంద్ర స్వామి మఠాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బి. వి జయ నాగేశ్వర రెడ్డి, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, టి.డి.పి జిల్లా అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ, జోన్ -5 ఇంచార్జి శ్రీనివాస రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రులు శ్రీ గురు రాఘవేంద్ర స్వామివారి బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మఠ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామివారు మంత్రులకు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలు, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంత్రుల మఠం దర్శనానికి ముందుగా మంచాలమ్మ గ్రామదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, జిల్లా అభివృద్ధి, సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు.

# నూతన పుస్తక నిక్షిప్త కేంద్రాలకు అనుమతినిచ్చిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు

**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 25:-** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు పుస్తక నిక్షిప్త కేంద్రం (బుక్ డిపాజిట్) కేంద్రాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ (సాయిబాబు రాజు) కేశవరం, కాట్రేనిపాడు ,రాజుల పాలెం ,జువ్విగూడెం, పుస్తక నిక్షిప్త కేంద్రాలకు అనుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా అనుమతులు తీసుకున్న పరిరక్షకులకు సాయిబాబు రాజు ఈ కేంద్రాలను పాఠకులకు గ్రామాల్లో యువత కు ఉపయోగపడేలా ఈ కేంద్రాలను అందుబాటులో ఉండేవిధంగా చూడాలని కేర్ టేకర్స్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రెటరీ కే జే ఎస్ ఎల్ కుమారి, కే కిషోర్, ఎం శ్రావ్య, సాయి తదితర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తాళ్ళరేవు గ్రంథాలయాన్ని సందర్శించి పాఠకులతో ముచ్చటించారు.



# పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి

**బిజెపి అసెంబ్లీ బి ఎల్ ఎ-1 ఇంచార్జ్ గోవర్ధన్ నాయుడు**



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 25 :-** బిజెపి ఓబీసీ మోర్చా పత్తికొండ మండల ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన మేడం పవన్ కుమార్ ఎన్నికభారతీయ జనతా పార్టీని ప్రతి గ్రామ గ్రామాన, బూత్ స్థాయి వరకు తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని భాజాపా నాయకులు తెలియజేశారు. మంగళవారం స్థానిక శారదా వృద్ధాశ్రమం నందు ఓబీసీ మోర్చా పత్తికొండ మండల అధ్యక్షులు రవికుమార్ అధ్యక్షతన నూతన మండల ఉపాధ్యక్షులుగా మేడం పవన్ కుమార్ కు నియామక పత్రాన్ని అందజేసి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ బిఎల్ఏ-1 ఇంచార్జ్ గోవర్ధన్ నాయుడు మాట్లాడుతూ బిజెపిలోని ప్రతి కార్యకర్త పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి, పార్టీ సిద్ధాంతాలను, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వారికి తెలిసేలా పనిచేయాలని కోరారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో రాష్ట్ర పార్టీ, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నాయకులు వారి వారి గ్రామాలలో అందరితో, ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపైన అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తూ అందరికీ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని, పార్టీ నాయకత్వం సూచించిన వ్యక్తులు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు వీలవుతుందని, అలాగే భారతీయ జనతా పార్టీకి చెందిన అన్ని మోర్చాలను అసెంబ్లీలో పూర్తిస్థాయిలో కమిటీలు వేసి పార్టీ బలోపేతం దిశగా అందరూ కలిసికట్టుగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులందరి సమక్షంలో పత్తికొండ మండల ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా మేడం పవన్ కుమార్ ను ఎంపిక చేసి, పార్టీ కండువ వేసి, నియామక పత్రాన్ని అందజేసి శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ పూనా మల్లికార్జున, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు రాంపల్లి రంగయ్య, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మాలేకర్ వీరేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకరయ్య ఆచారి, ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి భగవాన్ రావు, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు హరీష్ నాయక్, మండల ఉపాధ్యక్షులు పందికొన గోపాల్, కరణం చంద్రన్న, శివశంకర ఆచారి,హుళ్తేన్న, బంగారు చిన్న పాల్గొన్నారు.

# భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) తప్పనిసరి

**మండల వ్యసాయాధికారి అంగోత్ రమేష్**




**లింగాల మన జనప్రగతి ఆగస్టు 25:-** మండల పరిధిలోని గ్రామాల్లో భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడి) కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మురారిచింతల గ్రామంలో "పొలంపిలుస్తుంది" కార్యక్రమశీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రమేష్ మాట్లాడుతూ భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు ఇది వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది. రైతుకు చేకూరే ప్రయోజనాలు ఈ విశిష్ట సంఖ్య అర్హులైన భూమిగల రైతులు గుర్తించడంలో తోడ్పడి, వారికి ప్రభుత్వం నుండి వచ్చు వివిధ సబ్సిడీలు, పంటల బీమా, పంట మద్దతు ధరకు అమ్మకోవాలన్న , ఎరువులు, అన్నదాత సుఖీభవ పథకానికి, పీఎం కిసాన్ పథకం వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు నిరవధికంగా పొందేందుకు ఈ సంఖ్య ఉపయోగపడుతుంది. కాబట్టి రైతు సోదరులందరు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని తెలియచేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మురారి చింతల గ్రామంలో ఖరీఫ్ వేరుశనగ సాగు, సశ్యరక్షణపై ఏఓ రమేష్ సలహాలు సూచనలు అందజేశారు. రైతులు వారి యొక్క ఆధార్ నెంబర్ ,ఆధార్ అనుసంధారిత ఫోన్ నెంబర్ , పట్టాదారు పాస్ బుక్ తీసుకొని రైతు సేవా కేంద్ర సిబ్బందిని కలిసి ఈ నమోదును పూర్తి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటివరకు ఫార్మర్ ఐడీ పూర్తి కాని రైతుల జాబితా సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బంది వద్ద కలదని రైతు సోదరులు అందరూ కూడా ఈ ఫార్మర్ ఐడీ పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది, శర్ఫుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు: మంత్రి సవిత



**రొద్దం/శ్రీసత్యసాయి, మన జనప్రగతి ఆగస్టు 25:-** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.మంగళవారం రొద్దం మండలం కొగిర గ్రామంలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గడంతో 16,800 పదవులకు బీసీలు దూరమయ్యారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు బీసీల సంక్షేమంతో పాటు రాజకీయంగా వారి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.బీసీ సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్ని అడ్డంకులు వచ్చినా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు.అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త ఆంజనేయులు కుటుంబాన్ని మంత్రి పరామర్శించి రూ.5 లక్షల జీవిత బీమా చెక్ అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీల ఆత్మగౌరవ పరిరక్షకుడు చంద్రబాబు: మంత్రి అచ్చెన్నాయుడు



**మంగళగిరి,మన జనప్రగతి ఆగస్టు 25: -** బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత కల్పించడంలో టీడీపీ కీలక పాత్ర పోషించిందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, బీసీలపై కక్ష సాధింపు జరుగుతోందంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు.ఎన్టీఆర్ హయాంలో బీసీలకు రిజర్వేషన్లకు శ్రీకారం చుట్టగా, చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచారని తెలిపారు. వైసీపీ హయాంలో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడం వల్ల సుమారు 16 వేల రాజకీయ పదవులు బీసీలకు దూరమయ్యాయని ఆరోపించారు.ప్రస్తుత ప్రభుత్వం పాత చట్టం ప్రకారం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని, అవసరమైతే హైకోర్టు, సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బీసీల సంక్షేమం, విద్య, స్వయం ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.బీసీల హక్కులను పరిరక్షించేందుకు చివరి వరకు పోరాడతామని, చంద్రబాబు నాయకత్వంలో బీసీల ఆత్మగౌరవం, రాజకీయ సాధికారతకు మరింత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి తెలిపారు.

# గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

**అమరావతి, మన జనప్రగతి ఆగస్టు 25:-** అమలాపురం ప్రాంతానికి చెందిన గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత తీర రక్షక దళం 15 నౌకలు, నాలుగు హెలికాప్టర్లతో విస్తృతంగా గాలింపు చేపట్టిందన్నారు. మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ నిఘా కొనసాగుతోందని తెలిపారు. మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులకు సమాచారం అందించడంతో పాటు డైమండ్ హార్బర్, సుందర్‌బన్స్ పరిసర సముద్ర ప్రాంతాల్లోనూ గాలింపు విస్తరించినట్లు మంత్రి వెల్లడించారు. సముద్ర ప్రవాహాలు, వాతావరణ పరిస్థితులు, మత్స్యకారుల సాధారణ మార్గాలను పరిగణనలోకి తీసుకుని సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు.గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా తీసుకురావడానికి అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగిస్తున్నామని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు.

# సెప్టెంబర్ 1న చలో ఢిల్లీని జయప్రదం చేయండి: సీపీఐ

**పులివెందుల,మన జనప్రగతి ఆగస్టు 25: -** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే "బదలావ్ జరూరీ హైమార్పు రావాలి" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు పిలుపునిచ్చారు.మోడీ ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఆరోపించారు. రాయలసీమలో కరువు, వలసలు, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పులివెందుల మెడికల్ కాలేజీ విషయంలో ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుతో వ్యవహరిస్తోందని వెంకట రాములు ఆరోపించారు. ప్రజలు, యువత, విద్యార్థులు ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుభాన్ భాష, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
26- 08 - 2026

# జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం



**దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 25:–** ఆస్పరి ప్రాజెక్టు దేవనకొండల మండలంలోని కెజిబివి పాఠశాల నందు అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం ఈ శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు చిన్నారుల ప్రాథమిక అభ్యసన, బాలల సమగ్ర అభివృద్ధి, ఆటపాటల ద్వారా బోధన, సమ్మిళి విద్యా , అంచనా వేయు పద్ధతులు వంటి అంశాలపై శిక్షణ అందించడం జరిగింది. ఈ సందర్భంగా కెజిబివి సునీత, వెంకటేశ్వర్లు, మురళి, చంద్రకాంత్ శివలింగమ్మ, చందన, షాహినా మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో సమర్థవంతంగా అమలు చేసి చిన్నారుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు.

# వైసీపీ పాలనలో నామినేషన్లు అడ్డుకున్న చరిత్ర

### - రాబోయే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు స్వేచ్ఛగా పోటీ చేయవచ్చు: అతికారి కృష్ణ



**సిద్ధవటం, మన జనప్రగతి, ఆగస్టు 25:–** వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ విమర్శించారు. మంగళవారం సిద్ధవటం ఆకులవీధిలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలని జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో టీడీపీ, జనసేన అభ్యర్థులపై దౌర్జన్యాలకు పాల్పడి, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంతో పాటు తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపించారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు నిర్భయంగా, స్వేచ్ఛగా నామినేషన్లు వేసి పోటీ చేయవచ్చని అధికారి కృష్ణ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దౌర్జన్యాలు, అవినీతి, దోపిడీపై ప్రజలకు అవగాహన ఉందన్నారు.

# పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**సిద్ధవటం, మన జనప్రగతి, ఆగస్టు 25:–** కుందు నది నుంచి భారీగా నీరు చేరడంతో పెన్నా నదిలో నీటి ప్రవాహం పెరిగిందని, పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్ధవటం ఎస్సై హారిక సూచించారు. మంగళవారం సిద్ధవటం పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ నది తీర ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లవద్దని హెచ్చరించారు. పెన్నా ఇసుక మేట ప్రాంతాల్లో బర్రెలు, మేకలను మేపే యజమానులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇసుక తవ్వకాల కారణంగా నదిలో గోతులు ఏర్పడ్డాయని, ప్రస్తుతం నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. లింగంపల్లి, మాచుపల్లి, మూలపల్లి, వంతాటిపల్లి తదితర గ్రామాల రైతులు, ప్రజలు నదిలోకి దిగవద్దని సూచించారు. నది పరివాహక ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో గంజాయి కలకలం

- **1.280 కిలోల గంజాయి స్వాధీనం**
- **ఉత్తరప్రదేశ్‌కు చెందిన గంజాయి విక్రయదారుడు అరెస్ట్**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 25:** ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ప్రొద్దుటూరులో గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసులు దాడి చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మొత్తం 1.280 కిలోల గంజాయి, 11 గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.20 వేల ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. పింటూ అలియాస్ పింటూ కుమార్ (33) ఉత్తరప్రదేశ్‌లోని కనౌజ్ జిల్లా ప్రాంతానికి చెందినవాడు. ప్రస్తుతం ప్రొద్దుటూరులోని ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆగస్టు 25, 2026 ఉదయం 8.15 గంటలకు ఆర్టీపీపీ క్రాస్ రోడ్డు, రామేశ్వరం ప్రొద్దుటూరు టౌన్ పరిధిలో పోలీసులు దాడి నిర్వహించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయిలో 1,220 గ్రాముల గంజాయితో పాటు చాక్లెట్ రూపంలో ఉన్న 11 ప్యాకెట్లలో మరో 60 గ్రాముల గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తంగా 1,280 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసును ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 175/2026, ఎన్ డి పి ఎస్ యాక్ట్–1985లోని 8(సి ) ఆర్ /డబ్ల్యు 20(బి )(ఐఐ)(బి ) సెక్షన్ల కింద నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ టి.వి. కొండారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ దాడి నిర్వహించారు. నిందితుడిని అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ప్రొద్దుటూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యు. విభు కృష్ణన్, తెలిపారు.

# పత్తికొండలోనే మహాత్మ జ్యోతిరావు గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి



**పత్తికొండ, మన జనప్రగతి, ఆగస్టు 25:–** పత్తికొండకు కేటాయించిన మహాత్మ జ్యోతిరావు గురుకుల పాఠశాలను పట్టణంలోనే ఏర్పాటు చేయాలని, కంబలపాడుకు తరలించాలనే ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ భాష డిమాండ్ చేశారు.మంగళవారం పత్తికొండ నాలుగు స్తంభాల కూడలిలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలను పత్తికొండలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు రెండు గురుకుల పాఠశాలలు మంజూరు కాగా, ఒకటి మంత్రాలయంలో బాలికలకు, మరొకటి పత్తికొండకు బాలురకు కేటాయించారని తెలిపారు.పత్తికొండకు కేటాయించిన పాఠశాలను రవాణా సౌకర్యాలు సరిగా లేని కంబలపాడుకు తరలిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడతారని అన్నారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోహన్ రెడ్డి మాతృమూర్తి లక్ష్మీ నరసమ్మకు నివాళులు



**గాలివీడు మన జనప్రగతి ఆగస్టు 25:–** గాలివీడు మండలం అరవీడు గ్రామం కొత్తపల్లెకు చెందిన వైఎస్ఆర్ సిపి నాయకుడు మోహన్ రెడ్డి మాతృమూర్తి లక్ష్మీ నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం కొత్తపల్లెలో లక్ష్మీ నరసమ్మ భౌతికకాయాన్ని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె మృతిపట్ల సంతాపం తెలిపి, వారి కుటుంభ సభ్యులను పరామర్శించారు.వైఎస్ఆర్ సీపి మండల కన్వీవర్ మిట్టపల్లె యదుభూషణ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రమేష్ రెడ్డి,నాయకులు సుబ్బారెడ్డి,గడ్డం రెడ్డెప్ప రెడ్డి,బ్రహ్మానంద రెడ్డి,మిట్టపల్లి గోపికృష్ణారెడ్డి, శంకర్ రెడ్డి, కూర్మయ్యగారి హనుమంతు రెడ్డి, నియోజక వర్గ యువజనవిభాగం అధ్యక్షుడు రెడ్డికుమార్, నియోజక వర్గ సోషియల్ మీడియా అధ్యక్షుడు రంగాని వినోద్ నాయుడు, మండల సోషియల్ మీడియా అధ్యక్షుడు శివారెడ్డి,బ్రహ్మ నంద రెడ్డి, పప్పిరెడ్డి శివ శంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,నరసింహా రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

# పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలి




**పత్తికొండ, మన జనప్రగతి, ఆగస్టు 25:–** పత్తికొండ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గ్రామ పంచాయతీ ఈవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్. కృష్ణయ్య మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రిషన్లు, వాటర్‌మెన్లు చాలాకాలంగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉచిత బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. నెలకు మూడు సెలవులు, కార్మికులకు ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# 28న కొండపేటలో శ్రీ బలరామ పూర్ణిమ మహోత్సవం



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 25:–** చెన్నూరు మండలం కొండపేట రామాలయం వేదికగా ఈనెల 28వ తేదీ శుక్రవారం శ్రీ బలరామ పూర్ణిమ నిర్వహించడానికి కొండపేట శ్రీకృష్ణ మందిరం ఇస్కాన్ నిర్వాహకులు ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు, ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా శ్రీ బలరామ పూర్ణిమ నిర్వహిస్తున్నారు, సాయంత్రం 4: 40 నిమిషాలకు ఇస్కాన్ భక్తులచే నగర సంకీర్తన సాయంత్రం6:00 గంటలకు శ్రీ శ్రీ కృష్ణ బలరాముల దివ్య దర్శనం, హరే నామ సంకీర్తన, సాయంత్రం6:50 నిమిషాలకు మహా శంఖాభిషేకం, మహా పుష్పాభిషేకం, మహా హారతి తీర్థ ప్రసాద వితరణ నిర్వహిస్తారు, రాత్రి7:20 నిమిషాలకు నాటక ప్రదర్శన భగవద్గీత ప్రవచనం ఏర్పాటు చేశారు, సాయంత్రం6:20 నిమిషముల నుండి మహా అన్న ప్రసాద వితరణ 7వేలు మంది భక్తులకు ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి చెన్నూరు కాజీపేట మైదుకూరు కడప కమలాపురం ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి ఇస్కాన్ భక్తులు భారీగా తరలివస్తున్నారు, ఈ కార్యక్రమాన్ని చెన్నూరు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొండపేట ఇస్కాన్ కమిటీ నిర్వాహకులు కోరుతున్నారు,

# సాధిక్‌కి నాకు సంబంధం లేదు నాపై దుష్ప్రచారం మానుకోండి: ద్వారంపూడి



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 25:–** మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్సిపి నాయకులు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం పత్రిక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధిక ఖాన్ అనే వ్యక్తి కేవలం అతను షూటర్ సంస్థను ప్రారంభానికి నన్ను ముఖ్యఅతిథిగా పిలిచారు ఆ సమయంలో తప్ప మరి ఎప్పుడు అతన్ని కలిసింది లేదని ఆరోజు తనకు సాలువ కప్పి తీయించుకున్న ఫోటో సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ అతనికి నాకు సంబంధం ఉందని అతనిని తాను ప్రోత్సహించానని దృశప్రచారం చేస్తూ కొంత మంది ఆనందం పొందుతున్నారని ఇది తప్పు అని నూకరాజు కుటుంబ సభ్యుల మరణం చాలా బాధాకరమని ఆయన ఆ నిర్ణయం తీసుకునే ముందు ఎవరినైనా సంప్రదించి ఉంటే బాగుండేదని ద్వారంపూడి తెలిపారు ఇప్పటికైనా నిజ నిజాలు తెలుసుకొని ప్రవర్తించాలని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న వ్యక్తులకు హితవుపలికారు.

# అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 25:–** ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా అర్హులైన దివ్యాంగులకు వృద్ధులకు, వితంతువులకు కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదని ఏపీ దివ్యాంగులు, పింఛన్దార్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె యన్ ఆంధ్రయ్య తెలిపారు. చాలా మంది పూర్తి స్థాయి దివ్యాంగులు పింఛన్ రాలేదనే మానసిక ఆవేదన తో పింఛన్ పొందకుండానే మృతి చెందుచున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్లు కోసమే ఎలక్షన్ సమయాల్లో పింఛన్లు ఇస్తున్నారని తరువాత పట్టించుకోరన్నారు. పింఛన్దార్ల హక్కుల సాధన కోసం ప్రభుత్వం కృషి చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఎప్పటికి అప్పుడే పింఛన్లు మంజూరు చేయాలన్నారు నిరుద్యోగులైన దివ్యాంగులకు ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. దివ్యాంగులు ఒక్క పింఛన్ తోనే తమ కుటుంబాలను పోషించుకొనుటకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్న వ్యాపారాలు చేసుకొని అభివృద్ధి చెందుటకు ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమ సంస్థ నుండి సబ్సిడీ రుణాలు 5 లక్షలు నుండి 10 లక్షలు వరకు మంజూరు చేయాలన్నారు. ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వం మూడు సెంట్లు ఇంటి స్థలము, ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం ద్వారా పక్కా ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వం 2 ఎకరాలు వ్యవసాయం భూమి మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం మహిళా చైర్మన్ కె. నాగమణి, రమాదేవి, రత్నమ్మ, నరసింహ రాజు, సుబ్బారాయుడు, విశ్వనాథ్, గంగాధర్, పెద్దయ్య నాయుడు, గోపాల్ రాజు, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

# కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయంగా మమేకమైన శ్రీకాంత్ రెడ్డి



**సంబేపల్లె, మన జనప్రగతి ఆగస్టు 25:–** సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామంలో మంగళవారం వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.అనంతరం వంగిమల్లవాండ్లపల్లెకు చెందిన వైఎస్ఆర్‌సీపీ యువ నాయకుడు పవన్‌కుమార్ రెడ్డి ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఇటీవల మృతి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు మధుసూదన్ రెడ్డి తండ్రి ఐలా తిప్పారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమాల్లో పార్టీ మండల, నియోజకవర్గ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
26- 08 - 2026

## రైతన్నలు విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా

# నమోదు చేసుకోవాలి

**• వేంపల్లె ఏవో బాలగంగాధర్ రెడ్డి**




**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 25:-** మండలం లోని ఆయా గ్రామాల్లోని రైతులందరూ తప్పనిసరిగా 11 అంకెలతో కూడిన కలిగిన విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎద్దుల బాలగంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. మండలం లోని తాళ్లపల్లె, కత్తులూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పొలాల్లోకి వెళ్లి ఆయన మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా విశిష్ట సంఖ్య ను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, భవిష్యత్తులో ప్రతి రైతుకు వివిధ రకాల పథకాలు లబ్ధి చేకూరాలంటే 11 అంకెలతో కూడిన ఐడి నెంబర్ తప్పనిసరిగా పొందాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రత్తి పంటలో మెగ్నీషియం లోప నివారణకు లీటరు నీటికి 10 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ ను జింక్ లోప నివారణకు జింక్ సల్ఫేట్ ను ఒక లీటరు నీటికి 2 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలని ఆయన సూచించారు. అలాగే పత్తి పంట బెట్టకు గురి అయిన సమయంలో 2శాతం పొటాషియం నైట్రేట్ మరియు 2శాతం యూరియా ను పిచికారీ చేసుకోవాలి అని ఆయన కోరారు . ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడంతోపాటు , అలాగే ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుత ఎల్నినో వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని స్వల్పకాలిక వ్యవధి గల పంటలను సాగు చేయాలని ఆయన రైతులను కోరారూ. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ప్రతిభకు సేవా పతకాలు



**కర్నూలు బ్యూరో, మన జనప్రగతి, ఆగస్టు 25:** విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన 35 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సేవా పతకాలు అందజేశారు.మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జరిగిన నేర సమీక్షా సమావేశంలో 202526 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'అతి ఉత్కృష్ట', 'ఉత్కృష్ట' సేవా పతకాలను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించిన వారికి ఈ గౌరవం దక్కిందన్నారు. పతకాలు పొందిన వారిని ఆదర్శంగా తీసుకుని ఇతర సిబ్బంది కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థిని ప్రతిభ

**- విద్యార్థినిని అభినందించిన కరస్పాండెంట్ చక్రపాణి రెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 25:-** రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో వేంపల్లి శ్రీ చైతన్య హైస్కూల్ కు చెందిన విద్యార్థిని తలారి తనుశ్రీ రాష్ట్ర స్థాయి లో 5వ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచింది. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని గుంటూరు లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని సత్తా చాటింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొనగా ఈ పోటీల్లో అండర్16 బాలికల విభాగంలో తలారి తను శ్రీ తన ప్రతిభను చాటుకుని రాష్ట్ర స్థాయిలో 5వ స్థానాన్ని సాధించింది. చిన్న వయసులోనే చెస్‌పై ఆసక్తిని పెంచుకుని, నిరంతర సాధనతో రాష్ట్ర స్థాయి పోటీలో ఈ ఘనత సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె సాధించిన విజయం ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలిచింది.ఈ సందర్భంగా చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి,డైరెక్టర్లు చేతన్ రెడ్డి చైతన్య రెడ్డి తలారి తను శ్రీని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడమే చైతన్య హైస్కూల్ లక్ష్యమని వారు పేర్కొన్నారు.

## చెన్నూరు పరిధిలోని కనపర్తి గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన చెన్నూరు సి.ఐ షేక్ చాంద్ బాషా

**చెన్నూరు,మన జనప్రగతి, ఆగస్టు,25:-** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశాల మేరకు, చెన్నూరు సి.ఐ చాంద్ బాషా ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చెన్నూరు మండలం కనపర్తి గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు స్పష్టంగా సూచించారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని సి.ఐ చాంద్ బాషా సూచించారు.



# విద్యార్థినుల విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ చేయూత

**• 160 మంది విద్యార్థినులకు ఉచితంగా డ్రాయింగ్ పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, రైటింగ్ ప్యాడ్ల పంపిణీ**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 25:-** రోటరీ క్లబ్ ఆఫ్ ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థినులకు డ్రాయింగ్ పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, రైటింగ్ ప్యాడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రొటేరియన్లు కె. మల్లికార్జున, గజ్జల వెంకటేశ్వర రెడ్డి, కె. సునీల్ కుమార్, ఎస్. వెంకటేశ్వర్లు స్పాన్సర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థినుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు గణిత నైపుణ్యాలు, విద్యపై ఆసక్తిని పెంచేందుకు ఇటువంటి విద్యా సహాయ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి తోడ్పడటం రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యాలలో ఒకటని పేర్కొన్నారు. విద్యార్థినులు చదువులో మరింతగా రాణించేందుకు అవసరమైన సహకారం అందించేందుకు రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ ప్రెసిడెంట్లు గుర్రం రామకృష్ణ, ఎం. సూర్యనారాయణ రెడ్డి, తిరుమల బాల సూర్యరావు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు కొవ్వూరు రవికుమార్ రెడ్డి, రొటేరియన్లు అగ్గారపు వెంకటేశ్వర్లు, తిరుమల మురళి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు రోటరీ క్లబ్ సభ్యులకు, స్పాన్సర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

# 40 శాతం అర్హత మార్కులతో ఆఫ్‌లైన్‌లో స్పెషల్ టెట్ నిర్వహించాలి




**కడప, మన జనప్రగతి, ఆగస్టు 25:-** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు 40 శాతం అర్హత మార్కులతో ఆఫ్‌లైన్ విధానంలో స్పెషల్ టెట్ నిర్వహించాలని యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు.మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద యుటీఎఫ్ ఆధ్వర్యంలో స్పెషల్ టెట్ విధానాన్ని నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి టెట్‌లో రాయితీలు కల్పించకుండా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించడం వల్ల ప్రయోజనం లేదన్నారు.ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు 40 శాతం అర్హత మార్కులు నిర్ణయించాలని, ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించాలని, గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు వారు బోధించే సబ్జెక్టుల్లోనే పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. టెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(1)లో సవరణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 26న జిల్లా కేంద్రాల్లో బైక్ ర్యాలీలు, సెప్టెంబర్ 3న ఛలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో కాంగ్రెస్‌కు జోష్... 50 కుటుంబాలు పార్టీలో చేరిక

**ప్రొద్దుటూరు, మన జనప్రగతి, ఆగస్టు 25:-** ప్రొద్దుటూరులో కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆదరణ పెరుగుతోందని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ప్రొద్దుటూరు కాంగ్రెస్ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా అన్నారు.మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 50 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి, ఇర్ఫాన్ బాషా నూతనంగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ ప్రొద్దుటూరులో తాగునీరు, పారిశుద్ధ్యం, దోమలు, వీధి కుక్కలు, ట్రాఫిక్ వంటి సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న నాయకులు మౌలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయారని విమర్శించారు.రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. ప్రతి వార్డులో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఓటర్ల అభ్యంతరాలను 28లోపు పరిష్కరించుకోవాలి



**సిద్ధవటం, మన జనప్రగతి, ఆగస్టు 25: -** ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, మార్పులు ఉంటే ఈ నెల 28లోపు పరిష్కరించుకోవాలని ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీల్ సూచించారు. మంగళవారం గ్రామ సచివాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 1,370 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో బీసీలు 1,066 మంది, ఎస్టీలు 55 మంది, ఎస్సీలు 85 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు లేదా అభ్యంతరాలు ఉన్నవారు ఫారం-2 ద్వారా దరఖాస్తు చేసుకుని ఈ నెల 28లోపు పరిష్కరించుకోవాలని సూచించారు.

## జనబాటతో విద్యుత్ సమస్యలకు పరిష్కారం



**సిద్ధవటం, మన జనప్రగతి, ఆగస్టు 25: -** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే జనబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈ జయచంద్ర తెలిపారు. మండలంలోని కడపాయపల్లె గ్రామంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యలపై జనబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ జయచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు జనబాట కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వినియోగదారులు విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించి, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రైతుల పంట పొలాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం



**పత్తికొండ, మన జనప్రగతి, ఆగస్టు 25:** వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్ఆర్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కేంద్ర కమిటీ సభ్యులు, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శు లు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు పాల్గొన్నారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మతో పాటు మాజీ మంత్రులు ఆర్.కె. రోజా, తానేటి వనిత, పుష్పశ్రీ వాణి, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య నాయకులతో చర్చించారు. పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించినట్లు నాయకులు తెలిపారు.

## అన్నమయ్య జిల్లా ఎస్పీ రూపొందించిన 'సీఎంఎస్ 'కు ప్రతిష్టాత్మక అవార్డు.




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 25 :-** జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, రూపొందించిన వినూత్న 'కోర్టు మానిటరింగ్ సిస్టమ్' ప్రాజెక్టుకు జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది.జైపూర్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఎస్పీ 'టెక్నాలజీ సభా ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026'ను అందుకున్నారు.కోర్టు కేసులు, నిందితుల వివరాలు, కేసు స్థితి మరియు పర్యవేక్షణ, కోర్టు సమన్లు, వారెంట్ల ప్రక్రియ డిజిటలైజ్ కావడం వల్ల కేసుల విచారణ వేగవంతమై, నేరస్థులకు సకాలంలో శిక్షలు పడేలా వ్యవస్థ ఉపయోగపడుతుంది.

## వైఎస్ఆర్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం



**పత్తికొండ, మన జనప్రగతి, ఆగస్టు 25:–** వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.సమావేశంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, నందికొట్కూరు సమన్వయకర్త దారా సుధీర్, ఎమ్మిగనూరు సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం రాఖీ పౌర్ణమి సందర్భంగా కంగాటి శ్రీదేవమ్మ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## గడేకల్లులో నీటి అక్రమ తరలింపుపై రైతుల ఆందోళన



**విడపనకల్, మన జనప్రగతి, ఆగస్టు 25:–** గడేకల్లు గ్రామ పరిధిలో తాగునీటిని అక్రమంగా తరలిస్తున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఎల్సీ నుంచి వస్తున్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.రాత్రివేళ కాలువలకు రంధ్రాలు ఏర్పాటు చేసి, పైప్‌లైన్ల ద్వారా నీటిని సుమారు మూడు కిలోమీటర్ల దూరం తరలిస్తున్నారని, కొందరు రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు.అక్రమ నీటి తరలింపుపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ పైప్‌లైన్లను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, సాగునీటి శాఖ ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, ఆయకట్టు రైతులకు న్యాయంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## గోడ కూలి హాస్టల్ మృతి చెందిన విద్యార్థికి నివాళి



**ఉరవకొండ మన జనప్రగతి ఆగస్టు 25:–** ఉరవకొండ పట్టణంలోనీ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, హాస్టల్ ఆవరణలో హరితదివ్యాంగులసేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు, బి. మోహన్ నాయక్ విద్యార్థులతో కలిసి శెట్టూరు గ్రామంలో ఎస్సీ, హాస్టల్లో మృతి చెందిన విద్యార్థికి నివాళి అర్పించారు బి. మోహన్ నాయక్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా శెట్టూరు గ్రామంలో ఎనిమిది తరగతి చదువుతున్న విద్యార్థులు హర్ష వర్ధన్, తేజ బహిర్భూమికి కోసం వచ్చి హాస్టల్ పక్క నున్న పాడుబడిన భవనం కూలి హర్ష వర్ధన్ మృతి చెందాడు అక్షయ్ కాలువిరిగింది చాలా బాధకరం అని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి సరియైన సిబ్బంది లేక ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి వాచ్ మెన్స్, డేనైట్, వాచ్ మెన్స్ వెంటనే ఏర్పాటు చేయాలి ఉమ్మడి జిల్లా ల్లో ఎస్సీ, ఎస్టీ, హాస్టల్లో ఖాళీగా ఉన్న వాచ్ మెన్ ఫోస్టులను భార్తి చేయాలి కూటమి ప్రభుత్వం హర్షవర్ధన్ విద్యార్థి మృతి చెందిన కుంటుంబాని పరిహారం అందించాలి హాస్టల్లో పెండిగ్లో ఉన్న భవనాలు ప్రహరీ గోడలు వెంటనే నిర్మించాలి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో చంటి అశోక్ రమణ భాస్కర్ యాదవ్ మణికంఠ ధరణి కుమార్ బాబురావు గోపాల్ గోపినాథ్ పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, కొత్తపల్లి మహేంద్ర



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 25:–** 10 వేల కోట్ల పెట్టుబడితో 1325 మెగావాట్ల పవన విద్యుత్ సుజలాన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన కార్యక్రమానికి రాయదుర్గం నియోజకవర్గం కనేకల్ మండలానికి విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి ఐటీ,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్,మరియు విద్యాశాఖ శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వారిని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అదేశాలు మేరకు తోరణగళ్ళు ఎయిర్‌పోర్టులో కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలుతో స్వాగతం పలికిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్,కొత్తపల్లి మహేంద్ర, అనంతరం ఇరువురు కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడుకుని మండలంలో నెలకొన్న పలు సమస్యలను మరియు ప్రజలకు ఇంకను అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు మరియు విద్యా రంగానికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

## ప్రతి ఇంటి పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులన్ని దూరం

**• మలేరియా సబ్‌యూనిట్ అధికారి,నాగేంద్రప్రసాద్**



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 25:–**ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారి ంచవచ్చని,మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. అనంతరం బొమ్మనహాల్ పీహెచ్‌సీ పరిధిలోని దేవగిరి గ్రామంలో దోమల నివారణ, డెంగ్యూ,మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే'లో భాగంగా ఇళ్లలో, పరిసరాల్లో నిల్వ నీటిని తొలగించాలని అదేవిదంగా పాత టైర్లు,కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వస్తువులు,పనికిరాని పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి తొట్టెలు,డ్రమ్ములు, సంపులను తప్పకుండా మూతపెట్టి ఉంచాలని తెలిపారు,ముఖ్యంగా జ్వరం, తలనొప్పి,ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు,ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఈశ్వరయ్య,మలేరియా హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఏఎన్ఎం రమాదేవి,ఆశా కార్యకర్తలు శ్రావణి,లక్ష్మీదేవి, ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించిన మహిళా భక్తులు



**ఉరవకొండ, మన జనప్రగతి, ఆగస్టు 25:–** ఉరవకొండ పట్టణంలోని వివిధ అమ్మవారి దేవస్థానాలు మంగళవారం మహిళా భక్తులతో సందడిగా మారాయి. కురుగుంట బాల చౌడేశ్వరీ, చెరువు కట్ట సుంకులమ్మ ఆలయాల్లో మహిళలు, ముత్తైదువులు అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కుటుంబ సుఖసంతోషాలు, ఆరోగ్యం, కోరుకున్న కోర్కెలు నెరవేరాలని అమ్మవార్లను ప్రార్థిస్తూ భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. పెనహోబిలం శ్రీ ఉద్భవలక్ష్మి దేవస్థానం, ఉరవకొండ దుర్గాభవాని దేవస్థానాల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆయా ఆలయాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి.

## ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పులివారి హరిప్రసాద్

**- ఏకగ్రీవంగా ఎన్నిక.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా...**



**ఉరవకొండ,మన జనప్రగతి ఆగస్టు 25:–** ఉరవకొండ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, 'అనంతపోరు' మంత్లీ మ్యాగజైన్ ఎడిటర్ పులివారి హరిప్రసాద్ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మంగళవారం అనంతపురం నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సమావేశ భవనంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అనంతపురం జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించగా, ఉరవకొండ ప్రాంతానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు పులివారి హరిప్రసాద్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా హరిప్రసాద్‌కు జిల్లా, నియోజకవర్గ స్థాయి పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం హరిప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టులందరి సహకారంతో ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## శ్రీధరఘట్టలో ఓటర్ల అభ్యంతరాలపై డిప్యూటీ ఎంపీడీవో వెంకటరమణ విచారణ




**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 25:–**మండల పరిధిలో శ్రీధరఘట్ట గ్రామంలోని 89,90,91,92 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలపై మంగళవారం డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు, అనంతరం ఏఈఆర్ఓ, సూపర్‌వైజర్,బీఎల్‌ఓలు హాజరై ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలు,దరఖాస్తులను పరిశీలించారు,ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఓ వెంకటరమణ మాట్లాడుతూ.. ఓటర్ల వివరాలను తమ తమ ఓటర్లను క్షుణ్ణంగా పరిశీలించుకుని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు,ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, బీఎల్‌ఓలు,ప్రజలు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం దేశ సమగ్రతకు గొడ్డలి పెట్టు

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 25:–**

మహారాష్ట్రలో ఆటోలు,టాక్సీలు నడుపుకునే వారందరికీ తప్పనిసరిగా మరాఠీ భాష రావాలంటూ మహారాష్ట్ర లోని బిజెపి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం అత్యంత విచారకరం,దురదృష్టకరమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మహారాష్ట్రలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశ సమైక్యతకు,సమగ్రతకు గొడ్డలిపెట్టు అని అన్నారు. పాకిస్తాన్ కు,మహారాష్ట్రలోని బిజెపి ప్రభుత్వానికి తేడా ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. వెంటనే ఈ ఆదేశాలను ఉపసంహరించుకోవాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు.

## రైతు ఉద్యమ నేత సారంపల్లి మల్లారెడ్డికి ఘన నివాళి




**పత్తికొండ, మన జనప్రగతి, ఆగస్టు 25:–** రైతు ఉద్యమ నేత, సీపీఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల పత్తికొండలోని కామ్రేడ్ ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు.మల్లారెడ్డి చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ రైతుల హక్కులు, భూ సమస్యలు, గిట్టుబాటు ధరలు, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం మల్లారెడ్డి జీవితాంతం పోరాడారని కొనియాడారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ రైతాంగ హక్కుల కోసం పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో విప్లవ గీతాలు ఆలపించి నివాళులర్పించారు.కార్యక్రమంలో సీఐటీయూ, రైతు సంఘం నాయకులు, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ముగ్గురు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 25:–** వేంపల్లి పట్టణంలో ఈ నెల 23న షేక్ మహమ్మద్ రఫీ అనే వ్యక్తి పై దాడి చేసి చంపబోయిన కేసులో షేక్ నాసిర్ అహమ్మద్, షేక్ ఫయాజ్ మరో మైనర్ ను అరెస్ట్ చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. పాత కక్షలు మనసులో పెట్టుకుని వారు రఫీ పై హత్యాయత్నం చేశారని సిఐ తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తిరుపాల్ నాయక్ నిందితులను అరెస్టు చేసి పులివెందుల న్యాయస్థానంలో హాజరు పరిచారన్నారు. వారిని న్యాయమూర్తి రిమాండ్ కు తరలిస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇందులో ఒకరు మైనర్ నిందితుడు ఉన్నారని, అతన్ని కడప జువెనల్ హోం కు పంపించామని సిఐ వెల్లడించారు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి

**- వేంపల్లె సీఐ నరసింహులు**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 25: –** ద్విచక్ర వాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పట్టణ సీఐ నరసింహులు పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా మంగళవారం ఆయన వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ చలానాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రమాద బీమా తప్పనిసరి అన్నారు. తల్లిదండ్రులు ఎవరైనా మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే చర్యలు తప్పన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల గంగాధరలో ఘనంగా ప్రెషర్ డే వేడుకలు....






**గంగాధర మన జనప్రగతి ఆగస్టు 25:** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో ఈరోజు ప్రభుత్వ జూనియర్ కళాశాల గంగాధరలో ప్రెషర్ డే వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థి,విద్యార్థుల ను ఘనంగా స్వాగతం పలకడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కరీంనగర్ డిఐఇఓ సత్యవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని సూచిస్తూ, సామాజిక కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు కలలు కనండి కలలు నెరవేర్చే క్రమంలో కష్టపడి మంచి ఫలితాలు సాధించాలాని తెలుపుతూ విద్యార్థిని,విద్యార్థులు గత ఫలితాల కంటే అత్యధిక ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం జె. ఇందూర, రాజ మహేందర్, రాజు, మహేశ్వర్, సురేష్ , మనోహర్, శేఖర్,రాజు,వనిత, లైబ్రేరియన్ , కళాశాల ఆఫీసు సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వేంసూర్‌లో నూతన పెట్రోల్ పంప్‌కు స్థల పరిశీలన

### - బీరపల్లి గ్రామంలో ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్



**వేంసూర్,మన జనప్రగతి ఆగస్టు 25:**
మండలంలో బీరపల్లి గ్రామంలో నూతన రిటైల్ పెట్రోల్ పంప్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించిన స్థలాన్ని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెట్రోల్ పంప్ ఏర్పాటుకు అవసరమైన నిబంధనలు, స్థల పరిస్థితులు, ఇతర అంశాలను అధికారులతో కలిసి పరిశీలించారు.పెట్రోల్ పంప్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన అనుమతులు, నిబంధనల అమలు, స్థల అనుకూలత తదితర అంశాలపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలన చేపట్టారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌ఓసీ) జారీకి సంబంధించిన ప్రక్రియను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన

### - ఫిర్యాదులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలి: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

**కల్లూరు, మన జనప్రగతి ఆగస్టు 25:**
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ ఏన్కూర్ తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజల నుంచి అందిన ఫిర్యాదులకు సంబంధించిన ప్రదేశాలను సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యల పరిష్కారంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



# క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోండి

### ● నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ



**తిరుపతి మన జనప్రగతి ఆగస్టు 25:–** అమరావతి ఛాంపియన్ షిప్ – 2026 లో పాల్గొంటున్న క్రీకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తారకరామ స్టేడియం, క్యాంపస్ స్కూలు , మహిళా విశ్వవిద్యాలయం, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరుగుతున్న క్రీడా పోటీలను, ఏర్పాట్లను తిరుపతి నగర కమిషనర్ ఎం.జయకృష్ణ సందర్శించారు. వారికి కల్పించిన సౌకర్యాలను క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, పారిశుధ్యం, తాగునీరు, విశ్రాంతి, వైద్య సౌకర్యాలు వంటి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చూడాలని అధికారులు ఆదేశించారు. క్రీడల ద్వారా యువతలో ఆరోగ్యకరమైన పోటీతత్వం, నిబద్ధత, క్రమశిక్షణ పెంపొందుతాయని అన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, సానిటరీ సూపర్వైజర్ చెంచయ్య మరియు సిబ్బంది, క్రీడాకారులు ఉన్నారు.

# బీపీ మండల్ యాదవ్ జయంతి వేడుకలు



**మార్కాపురం, మన జనప్రగతి, ఆగస్టు 25:** బీసీలకు రిజర్వేషన్ల ఫలాలు అందేలా కృషి చేసిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి, మండల్ కమిషన్ మాజీ చైర్మన్ బీపీ మండల్ యాదవ్ 108వ జయంతి వేడుకలను మార్కాపురం బీసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ మండల్ బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం విశేషంగా కృషి చేశారని తెలిపారు.బీసీల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన రెండో వెనుకబడిన తరగతుల కమిషన్‌కు బీపీ మండల్ చైర్మన్‌గా పనిచేసి సమగ్ర నివేదిక అందించారని పేర్కొన్నారు. ఆయన కృషి ఫలితంగానే 1990 దశకంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమమైందన్నారు. బీసీలంతా ఆయనను సామాజిక న్యాయ పోరాటానికి మార్గదర్శిగా గుర్తిస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, న్యాయవాదులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొని బీపీ మండల్‌కు నివాళులర్పించారు.

# నాలెడ్జ్ హబ్‌గా అమరావతిని తీర్చిదిద్దుతాం



**అమరావతి, మన జనప్రగతి, ఆగస్టు 25:** అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అమరావతిలో నిర్మిస్తున్న క్వాంటం కంప్యూటింగ్ భవనాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.క్వాంటం వ్యాలీ మిషన్‌లో భాగంగా 45,216 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, డిసెంబర్ చివరి నాటికి నిర్మాణాన్ని పూర్తి చేసి జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలను ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.క్వాంటం ల్యాబ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, నిరంతర విద్యుత్ సరఫరా, సీస్మిక్ వైబ్రేషన్ల నియంత్రణ, క్రయోజెనిక్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.క్వాంటం వ్యాలీలో 48 అంతస్తుల చొప్పున రెండు భారీ టవర్లను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, స్టార్టప్‌లు, టెక్నాలజీ సంస్థలకు అవసరమైన స్థలాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని మంత్రి వెల్లడించారు. అమరావతిని ఆధునిక సాంకేతిక రంగానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# ఏపీయూకే మధ్య పట్టణాభివృద్ధిపై కీలక ఒప్పందం



**అమరావతి, మన జనప్రగతి ఆగస్టు 25:–** ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి ఏపీ ప్రభుత్వంయూకే ప్రభుత్వం మధ్య మంగళవారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. వెలగపూడి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు ఒప్పందంపై సంతకాలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ అమరావతిని ప్రపంచస్థాయి స్మార్ట్, లివబుల్ సిటీగా అభివృద్ధి చేయడంతో పాటు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు యూకే సాంకేతిక సహకారం ఉపయోగించుకుంటామని తెలిపారు.రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వ్యర్థాల నిర్వహణ, పట్టణ రవాణా తదితర రంగాల్లో ఆధునిక సాంకేతికత, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అమలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.40 వేల కోట్ల మౌలిక వసతుల పనులకు ఈ సాంకేతిక సహకారం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.అమరావతి అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక, సుస్థిర మౌలిక వసతులు, ఆధునిక రవాణా వ్యవస్థలు, డిజిటల్ టెక్నాలజీ తదితర రంగాల్లో యూకే నైపుణ్యాన్ని వినియోగించుకోనున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.కార్యక్రమంలో ఏపీసీఆర్డీఏ, పురపాలక శాఖ, మెట్రో రైల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో పాటు యూకే ప్రతినిధులు పాల్గొన్నారు.

### కనుల పండువగా సామూహిక

# మంగళ గౌరీ వ్రతాలు



**వేంపల్లె, మన జనప్రగతి, ఆగస్టు 25:–** వేంపల్లెలోని సంఘం వీధిలో గల గౌరీదేవి ఆలయంలో శ్రావణ మాస మంగళవారం సందర్భంగా మంగళ గౌరీ దేవి సామూహిక వ్రతాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.ఆలయ అర్చకుడు శంకరమంచి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంగళ గౌరీ వ్రత విశిష్టతను వివరించారు. ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా మహిళలకు సౌభాగ్యం, మాంగల్య రక్షణ కలుగుతుందని భక్తుల విశ్వాసమన్నారు.కార్యక్రమంలో బలిజ సంఘం, మహిళా మండలి ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఐదుగురు అరెస్ట్



**రాయచోటి, మన జనప్రగతి, ఆగస్టు 25:–** ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఐదుగురిని లక్కిరెడ్డిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి 112 కిలోల బరువున్న 6 ఎర్రచందనం దుంగలు, మారుతి స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.9.72 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు పోలీసులు మంగళవారం లక్కిరెడ్డిపల్లి మండలం బి.ఎర్రగుడి గ్రామం చెంచర్లపల్లి సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కారులో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిని దేవర్ల దయ, దేరంగుల రామాంజనేయులు, దక్షనపు రాజశేఖర్, ఎల్లపుసెట్టి లోకేశ్వర, అవులకుంట నాగార్జునగా పోలీసులు గుర్తించారు. కర్ణాటకకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్లతో వీరికి సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు.ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ, రాయచోటి ఎస్‌డీపీవో అభినందించారు.

# నీట్ విద్యార్థులపై దాడి చేయడం ఘోరం




**కడప మన జనప్రగతి ఆగస్టు 25:–** జులై 20 తేది నీట్ విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించడం ఘోరమైన విషయమని యూత్ కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షులు నందిమండలం వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం విద్యార్థులపై దాడికి నిరసనగా కేంద్ర ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేస్తూ కొవ్వొత్తుల కాగడాల ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మూరతోటి విజయకుమార్, సైడ్ కాజా మొయిద్దీన్ పాల్గొన్నారు.ఈ ప్రదర్శన కలెక్టరేట్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ విద్యార్థులపై రబ్బరు బుల్లెట్లతో దాడి చేయడం హేయమైన చర్యను తెలిపారు. వీటికి బాధ్యులైన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ గాంధీ ఏడు గంటలు నిరసన తెలిపారని అన్నారు. దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని సమగ్ర నివేదిక అందించాలని డిమాండ్ చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్రం హోమ్ మినిస్టర్ అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర కోఆర్డినేటర్ బండి జకరయ్య, దాసరి శ్రీనివాసులు కరీం అబ్బాస్ అవినాష్,కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆధార్ సేవలను వేగవంతం చేయాలి

**● DLAMC సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ● బయోమెట్రిక్ నవీకరణ, చిన్నారుల ఆధార్ నమోదుపై ప్రత్యేక దృష్టి ● ప్రతి మండలంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి**



**కడప మన జనప్రగతి ఆగస్టు 25:** – జిల్లాలో ఆధార్ నమోదు, వివరాల నవీకరణ ప్రక్రియలను మరింత వేగవంతం చేసి పెండింగ్‌ను తగ్గించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ (DLAMC) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వర్చువల్ గా హైదరాబాద్ ఆధార్ రీజనల్ కార్యాలయం నుండి అసిస్టెంట్ మేనేజర్ జావీద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ముఖ్యంగా 0–5 ఏళ్ల చిన్నారుల ఆధార్ నమోదు, 5–15 ఏళ్లు, 15 ఏళ్లు పైబడిన వారి తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమం తప్పకుండా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హులందరికీ ఆధార్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 206 ఆధార్ కిట్లు పనిచేస్తుండగా, గత 30 రోజుల్లో 29,299 నమోదు, నవీకరణ లావాదేవీలు నమోదైనట్లు తెలిపారు. ప్రతి మండలాన్ని కవర్ చేసేలా క్రియాశీల ఆధార్ కేంద్రాలను అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అదనపు కిట్లు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో 5–15 ఏళ్ల వారికి 37,627, పదిహేనేళ్ళ పైబడిన వారికి 21,865 నమోదులకు కలిపి మొత్తం 59,492 తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణలు పెండింగ్‌లో ఉన్నాయని రికార్డుల ద్వారా తెలుస్తోందన్నారు. అయితే.. ఈ పెండింగ్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు పాఠశాలలు, అంగన్‌వాడీలను కేంద్రాలుగా చేసుకుని శిబిరాలు నిర్వహించాలని, నవీకరణ చేయించుకోని వారిని సచివాలయాల ద్వారా గుర్తించి సమీప ఆధార్ కేంద్రాలకు తరలించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా, తపాలా శాఖ, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని మొబైల్ పరికరాల ద్వారా ఇంటింటికీ లేదా శిబిరాల ద్వారా మొబైల్ ఆధార్ నవీకరణ సేవలను విస్తరించాలని సూచించారు. ఆధార్ నవీకరణకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సేవలు అందేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని పేర్కొన్నారు. **తప్పుడు ధ్రువపత్రాలపై అప్రమత్తంగా ఉండాలి** ఆధార్ నమోదు, నవీకరణలో తప్పుడు లేదా ద్వంద్వ ధ్రువపత్రాల వినియోగాన్ని అరికట్టేందుకు సంబంధిత శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ద్వంద్వ జనన ధ్రువపత్రాలు, ద్వంద్వ పదో తరగతి మార్కుల జాబితాలు, గడువు తర్వాత జారీ చేస్తున్న మాన్యువల్ నివాస ధ్రువపత్రాల అంశాలపై సమగ్ర పరిశీలన, ధ్రువీకరణ చేపట్టాలని సూచించారు. ప్రజల్లో ఆధార్ నవీకరణపై అవగాహన పెంచేందుకు జిల్లా అధికారిక సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించాలని, ఆధార్ నవీకరణ అవసరమైన వారంతా సమీప కేంద్రాలు, ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్జీ& ఎస్డిఓ డి. ప్రతాప్ రెడ్డి, సిఎస్‌సి డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్. సుబ్రమణ్యం, ఐసిడిఎస్ పిడి పి. రామాదేవి, పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ జి. రాజేష్, విద్యా శాఖ డిఈఓ (ఎస్ఈ) డా. షేక్ షంషుద్దీన్, డిఎంహెచ్ఓ డిఐఓ ఇన్‌చార్జ్ డా. జె. ప్రవీణ్ కుమార్, లీడ్ బ్యాంక్ ఎల్‌డిఎం ఇంచార్జి ఏ. శ్రీ పుష్పవాణి, పోలీసు ఇన్‌స్పెక్టర్ జి. ఇదుర్ బాషా సంబందిత కమిటీ అధికారులు పాల్గొన్నారు.

# హెచ్.ఐ.వీ పై అవగాహనకు ఎల్ఈడీ ప్రచార రథం ప్రారంభం



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 25:–** హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ ప్రచార వాహనాన్ని డీఎల్ఏటీఓ డా. ఎల్. రాధిక, డీసీహెచ్ఎస్ డా. లక్ష్మీ ప్రసాద్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, వ్యాధిపై ఉన్న అపోహల తొలగింపు, హెచ్ఐవీ పరీక్షల ప్రాధాన్యత, చికిత్స విధానం, ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎల్ఈడీ వాహనం ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ వ్యాప్తికి సంబంధించిన అపోహలను తొలగించడంతో పాటు, హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి సామాజికంగా, మానసికంగా అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీని ముందుగానే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు ఏఆర్టీ చికిత్సను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. చెన్నారెడ్డి మాట్లాడుతూ ఎల్ఈడీ ప్రచార వాహనం ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, 95–95–99 లక్ష్యాలు, హెచ్ఐవీ పరీక్షలు, ఏఆర్టీ చికిత్స, సురక్షిత ప్రవర్తన, అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. ఆనంద్ కుమార్, పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ టి. స్వాతి, పీసీఎస్ఎస్ సిబ్బంది, ఏరియా హాస్పిటల్, ఐసీటీసీ సిబ్బంది, జనచేతన ప్రాజెక్ట్ మేనేజర్, ఎల్‌డబ్ల్యూఎస్ ఆరోగ్య కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# బద్వేల్ నియోజకవర్గంలో జనసేన బలంగా ఉంది

**- జనసేన ఆత్మీయ సమావేశంలో తుదిమెళ్ల మురళి**



**పోరుమామిళ్ల మన జనప్రగతి ఆగస్ట్ 25 :–** పట్టణంలోని మలకత్తువ వద్ద వున్న వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మంగళవారం బద్వేల్ నియోజకవర్గం జనసేన పార్టీ ఆత్మీయ సమావేశాన్ని జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోటపాటి వెంకటరామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా భారీగా జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బద్వేల్ నియోజవర్గంలో జనసేన పార్టీ బలాబలాలు, భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. ముఖ్య అతిధిగా జనసేన నాయకుడు రాష్ట్ర సివిల్ సప్లై కార్పోరేషన్ డైరెక్టర్ తుదిమెళ్ల మురళి పాల్గొన్నారు. ఈ సందర్బంగా మురళి మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో మన శక్తిని పదిరెట్లు పెంచుకోవలసిన అవసరం ఉందని అన్నారు. మన బలాబలాలను అవగాహన చేసుకొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని, అప్పుడే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ లను గెలిపించుకోగలుగుతాం అన్నారు. బద్వేల్ మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన పార్టీ బలంగా ఉందన్నారు. ఐకమత్యాన్ని పెంచుకుంటూ నూతన నాయకత్వానికి కూడా ఆహ్వానం పలికితే మరింత బలమైన శక్తిగా మారతాం అన్నారు. కడప జిల్లాలో రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలేకాదు, బద్వేల్ నియోజకవర్గంలో కూడా జనసేన పార్టీ బలంగా ఉందని నిరూపించాల్సిన భాద్యత మనందరిమీద ఉందన్నారు. మన నాయకుడు పవన్ కళ్యాణ్, లక్ష్యాన్ని సిద్ధాంతాన్ని నిర్మించాలంటే అందరం ఐకమత్యంగా ముందుకు పోవాల్సిన అవసరం ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఈశ్వర్ రెడ్డి, కోటపాటి వెంకటేష్, షేక్ ఇమ్రాన్, సిద్దు, లకిడి వంశీ, ఖలీల్ బాషా,చంద్ర,శ్రీకాంత్ రెడ్డి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్ అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**● రెవెన్యూ సేవల్లో 12 ప్రమాణికాల్లో పురోగతిపై సమీక్ష**

**కడప మన జనప్రగతి ఆగస్టు 25:–** ప్రజలకు రెవెన్యూ సేవలు వేగంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలు, సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమావేశంలో రెవెన్యూ, ప్రజా సేవలకు సంబంధించి 12 ప్రధాన ప్రమాణికాల్లో పురోగతిపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు.. జేసీ డా. నిధీమీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డిఆర్వో మల్లికార్జునుడు హాజరయ్యారు. ఈ సమీక్షలో పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, పునఃసర్వే, ప్రజా ఫిర్యాదులు, 22–ఏ కేసులు, భూసేకరణ, ప్రభుత్వ భూముల కేటాయింపు, భూముల బదలాయింపులు, జెడ్‌హెచ్‌డీసీ భూములు, రెవెన్యూ రికార్డుల డిజిటలీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా ఫిర్యాదులను కేవలం పరిష్కరించినట్లు నమోదు చేయకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ సూచించారు. 22–ఏ జాబితాలో తప్పుగా నమోదైన భూములను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే తప్పు నమోదుల తొలగింపుతో వచ్చిన ఫిర్యాదులపై దశల వారీగా భూ పరిష్కారం లభిస్తోందన్నారు. ఈ ప్రక్రియను ఇంకా వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పునఃసర్వేకు అనుకూలమైన గ్రామాల్లో ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్ దశలను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ, ప్రభుత్వ భూముల కేటాయింపు ప్రతిపాదనలను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు పంపాలన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, వారసత్వ మార్పులు, ఉపవిభజనలు, డిజిటల్ సంతకాల ప్రక్రియలను వేగవంతం చేయాలని, ఐవీఆర్ఎస్ ద్వారా వస్తున్న ప్రజల స్పందనలను పరిశీలించి లోపాలను సరిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెలా రెవెన్యూ సేవల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని, తదుపరి సమావేశం నాటికి స్పష్టమైన పురోగతి కనిపించాలని అధికారులకు సూచించారు. అన్ని రెవెన్యూ సేవల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు ప్రాధాన్యం ఇవ్వాలని,




ప్రజలకు అవసరమైన సేవలు నిర్ణీత సమయంలో అందేలా సిబ్బందిని సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, తదుపరి నెలవారీ సమీక్ష నాటికి స్పష్టమైన పురోగతి కనిపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మురళీ, శిరీష, చంద్రమోహన్, చిన్నయ్య లతో పాటు.. ఆయా రెవెన్యూ డివిజన్లలోని మండల తహసీల్దార్లు, డిటీలు, సంబందిత రెవెన్యూ అధికారులు.పాల్గొన్నారు.

# ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు నిందితుడు సాదిక్‌ను కఠినంగా శిక్షించాలి

**● కలెక్టర్‌ను కలిసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 25:–** సంచలనం సృష్టించిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌ను కలిశారు. నూకరాజు మనవడు రిలయన్స్ కార్తీకేయ రెడ్డితో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లిన ఎంపీ, బాధిత బాలుడికి భద్రత కల్పించాలని, వారి కుటుంబ ఆస్తులను పరిరక్షించాలని మరియు సమగ్ర దర్యాప్తు జరపాలని కోరుతూ వినతిపత్రం జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ నిందితుడిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు సాదిక్ వేధింపులే కారణమని, కెనడా నుంచి తెచ్చిన విషపూరిత పౌడర్‌ను ప్రొటీన్ షేక్స్‌లో కలిపి హత్యలకు పాల్పడ్డాడని ఆరోపించారు. తల్లి సౌజన్య రాసిన లేఖలో సాదిక్ పెట్టిన శారీరక, మానసిక వేధింపులు, 24 గంటల ఫోన్ ట్రాకింగ్, మతమార్పిడి ఒత్తిడుల వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంట్లో దేవుడి ఫొటోలు తొలగించి ఖురాన్ చదవాలని, నమాజ్ చేయాలని బెదిరించాడని వివరించారు. పిల్లలను అడ్డం పెట్టుకుని తల్లులను టార్గెట్ చేస్తూ పక్కా ప్రణాళికతో సాగించిన కుట్ర ఇదని ఆయన విమర్శించారు. నూకరాజు కుటుంబానికి చెందిన పూర్తి ఆస్తులు బాలుడు కార్తీకేయ రెడ్డికే దక్కేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎంపీ తెలిపారు. అలాగే, సాదిక్ వద్ద కోచింగ్ తీసుకున్న మిగతా పిల్లల పరిస్థితిపై విచారణ జరిపి వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని, ఈ కేసును సీబీఐకి అప్పగించి నిందితుడికి ఉరిశిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. నిందితుడి తరఫున ఎవరూ వాదించవద్దని బార్ అసోసియేషన్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం బాలుడు కార్తీకేయ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తన కుటుంబానికి జరిగిన ఘోరాన్ని వివరించి కన్నీటిపర్యంతమయ్యాడు. తాను మూడో తరగతిలో రైఫిల్ షూటింగ్ నేర్చుకుంటున్న సమయంలో సాదిక్ కోచ్‌గా పరిచయమై తమ కుటుంబంలోకి ప్రవేశించాడని తెలిపాడు. తన తల్లి సౌజన్యను ప్రతిరోజూ చిత్రహింసలకు గురిచేసేవాడని, తండ్రికి ప్రొటీన్ షేక్‌లో కెమికల్ కలిపి ఇచ్చి కిరాతకంగా చంపేశాడని ఆరోపించాడు. ఈ విషయాలు బయటకు చెబితే ఉగ్రవాదులకు అమ్మేస్తానని బెదిరించేవాడని, కుటుంబాన్ని నాశనం చేసి తనను అనాథను చేశాడని, ప్రస్తుతం బయటకు రావాలంటేనే తీవ్ర భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు.

# అనంతపురంలో సుజ్లాన్ భారీ పవన విద్యుత్ ప్రాజెక్టులు






**అనంతపురం జిల్లా, మన జనప్రగతి, ఆగస్టు 25**: అనంతపురం జిల్లాలో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో సుజ్లాన్ సంస్థ చేపట్టనున్న 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెరలో జరిగిన కార్యక్రమంలో సుజ్లాన్ సంస్థకు చెందిన ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్‌ను నారా లోకేష్ ప్రారంభించారు. రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ఈ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ భారీ పెట్టుబడులతో అనంతపురం జిల్లాలో పునరుత్పాదక ఇంధన రంగానికి మరింత ఊతం లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174